చార్మినార్‌లో కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని చార్మినార్ శాసన సభ నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశారు. ఈ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీలో జరుగనుంది. కౌంటింగ్ హాల్‌లో 198 ఈవీఎంలకు గాను..14 టేబుల్స్ ఏర్పాటు చేసి 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి చేయనున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్, నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వెంకన్న తెలిపారు. చార్మినార్ శాసనసభ నియోజకవర్గంలో 2,30,298 ఓటర్లుండగా..ప్రస్తుతం 1,11,761 ఓట్లు పోలయ్యాయన్నారు. ఇందులో 59,818 పురుష ఓటర్లు కాగా.. 51936 ఓటర్లు మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నార న్నారు. నియోజకవర్గంలో మొత్తం 48.53 శాతం ఓట్లు పోలయ్యాయన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. కౌంటింగ్‌కు సంబంధించి ప్రత్యేక పాసులు ఉన్న వారిని మాత్రమే అనుమతిస్తామన్నారు. హాల్‌లోకి అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బందితో పాటు ఎవరికి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు.

ఆర్.సీ నెంబర్:77 రద్దు హర్షణీయం


కందికొండ శ్రీనివాస్


రామకృష్ణ

అబిడ్స్: గణిత ఉపాధ్యాయుల పనిభారాన్ని దృష్టిలో ఉంచుకొని శాస్త్రీయ పద్ధతులను అధ్యాయనం చేసి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం ఎంతో అమోఘమని తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వై.రామకృష్ణ పేర్కొన్నారు. 6, 7 తరగతుల గణితాన్ని భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు చెప్పాలని ప్రభుత్వం ప్రకటించడంతో తమ దీర్ఘకాల సమస్య పరిష్కారం అయ్యిందని వారన్నారు. సోమవారం కందికొండ శ్రీనివాస్, రామకృష్ణ విలేకర్లతో మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులకు, గణితశాస్త్ర బోధకులకు ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. అశాస్త్రీయంగా 2016–17లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఆర్.సీ నెంబర్:77ను రద్దు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని వారన్నారు. భౌతికశాస్త్ర బోధకులు 8, 9, 10 తరగతులకు భౌతికశాస్త్రంతో పాటు 6, 7 తరగతులకు గణితం కూడా చెప్పాలని తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ఈ ప్రభుత్వ నిర్ణయంతో లక్షలాది మందికి లాభం చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ శ్రీదేవసేన, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రాధారెడ్డికి గణిత ఫోరం తరపున వారు కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: వేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో దేవనాథ్ జీయర్ స్వామి మంగళ శాసనములతో తిరుముల వేంకటేశ్వరుని దిశా నిర్దేశం పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో అంతర్యామిగా స్వామి ఉంటారని తెలిపారు. వేంకటేశ్వర స్వామి మహాత్యాన్ని పుస్తక రూపంలో ఎంతో చక్కగా వివరించారని కొనియాడారు. అంతకు ముందు రమాప్రభ బృందంతో భజ గోవిందం పేరిట నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు ఎన్‌వీఎస్ ప్రభాకర్‌శర్మ, విశ్రాంత ప్రొఫెసర్ టి.గౌరీశంకర్, రచయితలు గోవిందదాసు, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయ కమిటీ ఎన్నిక



యాకుత్‌పురా: రానున్న ఆషాఢ మాసం బోనాలను పురస్కరించుకొన్ని హరిబౌళి అక్కన్న మాదన్న మంహకాళీ ఆలయ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా జగ్‌మోహన్ పర్షద్, ప్యాట్రన్‌గా నిరంజన్ కార్యాదర్శిగా దత్తత్రేయ, కోశాధికారిగా సతీష్‌కుమార్, సలహాదారులు రాజారత్నం, డాక్టర్ ఆవుల భరత్ ప్రకాష్, రాందేవ్ అగర్వాల్, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, కృష్ణ, వినోద్, సంయుక్తా కార్యదర్శులుగా విజయ్‌కుమార్, చేతన్ కుమార్ సూరి, శ్రీనివాస్, జోగిందర్ సింగ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్.పీ క్రాంతికుమార్, కార్యవర్గ సభ్యులుగా రాజు, బస్వరాజు, కన్నయ్యలాల్, దినేష్, లోకేష్ సుగంధి, రాంసింగ్ టాకుర్, ముఖేష్ యాదవ్, యువజన కమిటీ కన్వీనర్‌గా మహేష్ కుమార్‌ను ఎన్నుకున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు


వేడుకలను ప్రారంభిస్తున్న ఏజీఎం మహేష్, వినయ్, కృష్ణప్రసాద్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: మెహిదీపట్నంలోని చెన్నై సిల్క్స్ శ్రీ కుమారన్ తంగమళిగై 7వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. 7 సంవత్సరాలుగా మమ్మల్ని ఆదరిస్తున్న కస్టమర్లకు ఎప్పటికి రుణపడి ఉంటామని తెలిపారు. ఎప్పుడూ సరికొత్త డిజైన్లతో అన్ని వర్గాల వారికి అందుబాటు ధరలో ఉంటాయని తెలిపారు. 7వ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి 2 వేల రూపాయల కొనుగోలుపై ఒక బహుమతి అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ ఆర్. మహేష్ ఏజీఎం, మేనేజర్లు వినయ్, కృష్ణ ప్రసాద్, కష్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు


విద్యార్థులతో మాట్లాడుతున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: చదువుకున్న వారికి బంగారు భవిష్యత్తు ఉందని పీస్ ఫోర్స్ సొసైటీ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. చదువుకోవడానికి ఇష్టపడక తమ మాట వినడం లేదని ఇద్దరు వ్యక్తులు తమ పిల్లలతో మహ్మద్ నజీబ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు రెండు సెషన్‌లలో కౌన్సెలింగ్ నిర్వహించారు. 14 ఏళ్లలోపు పిల్లలు ఎక్కడ పని చేయరాదన్న నిబంధనలు ఉన్నాయని ఆయన అన్నారు. చిన్నతనం నుంచే పనులు చేస్తే అటువంటి వారి ఆరోగ్యం దెబ్బతిని జీవితాలు పూర్తిగా చెడిపోతాయని ఆయన పేర్కొన్నారు. వేసవి సెలవులు అయిపోగానే తాము క్రమంగా బడికి వెళ్లి చదువుకుంటామని ఆ పిల్లలు ఒప్పుకున్నారు. ఆయనను కలిసిన వారిలో మహ్మద్ ఇమామ్, జాకీర్ హుస్సేన్ తదితరులున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



జియాగూడలో.. ఎమ్మెల్సీ ప్రభాకర్, శ్రీనివాస్ గుప్తా, నరహరిచారి, కిశోర్‌కుమార్

జియాగూడ: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ ప్రభాకర్ అన్నారు. సోమవారం జియాగూడ భగత్‌సింగ్ చౌరస్తాలో బీఆర్ఎస్ గ్రేటర్ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటైన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరై ఆవిష్కరించారు. సీనియర్ ఉద్యమ నాయకులు రంగ పరందాములు, జియాగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు నరహరిచారి, కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్, మాజీ అధ్యక్షుడు జెడల మోహన్, దిలీప్‌కుమార్, మంతటి నర్సింహ, ప్రధాన కార్యదర్శి సి.బాబు, మహిళా అధ్యక్షురాలు సంగీత, సుకన్య, అనిత, వినోద్‌కుమార్, యూత్ జియాగూడ అధ్యక్షుడు హేమంత్‌రాజ్, ప్రకాష్, రాజేందర్ పాల్గొన్నారు.

పాతబస్తీలో..

పెరిగిన పోలింగ్.. ఎవరో విన్నింగ్?

- పెరిగిన పోలింగ్‌తో తమదే విజయమంటున్న బీజేపీ
- గెలుపు ఖాయమంటున్న మజ్లిస్



చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎవరు విజయం సాధిస్తారనే ఉత్కంఠతకు నేడు తెరపడనుంది. మజ్లిస్ కంచుకోటగా భావిస్తున్న హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో వరుసగా విజయం సాధిస్తున్న మజ్లిస్ పార్టీ, ఈసారి జరిగిన ఎన్నికల్లో కూడా తమదే విజయమని ధీమాగా ఉన్నారు. అయితే ప్రస్తుతం హైదరాబాద్‌లో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయని.. ఈ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు సాధిస్తామని బీజేపీ అభ్యర్థి మాధవీలత గట్టి నమ్మకంతో ఉన్నట్లు పార్టీ నాయకులు అంటున్నారు. హైదరాబాద్‌లో మజ్లిస్ పార్టీకి గట్టిగా బలమున్నప్పటికీ.. బీజేపీ అభ్యర్థి మాధవీలత ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహించి అసదుద్దీన్ ఒవైసీని ఉక్కిరిబిక్కిరి చేశారు. గతంలో కన్నా ఈసారి పోలింగ్ శాతం పెరిగిందని.. ఈ పెరిగిన ఓట్లన్నీ తమ ఖాతాలోనే పడతాయని.. హైదరాబాద్‌లో విజయం సాధించి ప్రధాని మోదీకి బహుమతిగా అందజేస్తానని చెప్పిన ఆమె ధీమా ఫలించేనా.. లేక ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లాగే ఈ ఎన్నిక కూడా నామమాత్రంగానే మిగిలిపోయి మజ్లిస్ పార్టీ గెలవనుందా.. అనే విషయాలు నేడు జరుగనున్న కౌటింగ్ స్పష్టం చేయనుంది. ఇక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థితో పాటు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోనున్నారని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు.

గెలుపు ధీమాలో మజ్లిస్

2019 పార్లమెంట్ ఎన్నికల్లో తక్కువగా ఓటింగ్ నమోదు కాగా.. 2024లో ఎక్కువగా నమోదయ్యింది. ఎక్కువైనా.. తక్కువైనా హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీదే విజయమని అన్ని సర్వేలు ఇప్పటికే తేల్చి చెప్పాయి. సర్వేల మాటెలా ఉన్నా.. పెరిగిన పోలింగ్ శాతం ఎవరి ఖాతాలోకి వెళతుందోనని అటు పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు పాతబస్తీ ఓటర్లలో ఆసక్తిని కలిగిస్తుంది. ఇది ఎవరికి మేలు చేస్తుందో నేడు జరిగే కౌంటింగ్‌లో తేలనుంది. ఈసారి హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెరగడంపై పాతబస్తీలో పోలింగ్ జరిగినప్పటి నుంచి చర్చనీయాంశమైంది. పాతబస్తీలోని నాలుగు శాసన సభ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం ఈసారి పెరిగింది. 2009 ఎన్నికలతో పోల్చితే కొంత శాతం పోలింగ్ పెరిగింది. ఇలా పెరిగిన ఈ పోలింగ్ శాతం ఎవరికి అనుకూలంగా మారుతుందోనని లెక్కలు వేస్తున్నారు. అయితే మజ్లిస్ పార్టీకే అనుకూలంగా మారవచ్చునని అంటున్నారు.

ఈసారి పోలైన ఓట్లు..

- చార్మినార్ నియోజకవర్గంలో 2,30,298 ఓటర్లుండగా ప్రస్తుతం 1,11,761 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 59,818 పురుష ఓటర్లు కాగా 51936 ఓటర్లు మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 48.53 శాతం ఓట్లు పోలయ్యాయి.
- చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో 3,49,611 మంది ఓటర్లుండగా 1,71,826 (49.15 శాతం) ఓట్లు పోలయ్యాయి.
- యాకుత్‌పురా నియోజకవర్గంలో 3,60,712 ఓటర్లుండగా 1,56,341 (43.34 శాతం) ఓట్లు పోలయ్యాయి.
- బహదూర్‌పురా నియోజకవర్గంలో 3,21,904 ఓటర్లుండగా 1,63,204 (50.7శాతం) ఓట్లు పోలయ్యాయి.
- పాతబస్తీలోని నాలుగు శాసనసభ నియోజకవర్గాల్లో మిగతా మూడింటికన్నా.. బహదూర్‌పురాలో ఎక్కువ శాతం ఓట్లు పోలయ్యాయి.
- ఇక్కడ ఎక్కువగా పోలైన ఓట్లు మజ్లిస్ పార్టీ ఖాతాలోకి వెళ్లనున్నాయి.

గత పార్లమెంట్ ఎన్నికల్లో...

- 2019లో హైదరాబాద్ పార్లమెంటు నియోజవర్గానికి జరిగిన పోలింగ్‌లో పాతబస్తీ శాసనసభ నియోజకవర్గాల్లో గతంలో కన్న తక్కువగా పోలింగ్ శాతం నమోదయ్యింది. అయినప్పటికీ సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీనే విజయం సాధించారు. పాతబస్తీలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, యాకుత్‌పురా తదితర శాసనసభ నియోజకవర్గాల్లో 2009, 2014లలో కన్నా తక్కువ పోలింగ్ శాతం నమోదైనప్పటికీ.. 2009, 2014, 2019లలో అసదుద్దీన్ ఒవైసీ ఘన విజయం సాధించారు. ఈసారి పోలైన ఓట్లతో పోల్చితే 2019 ఎన్నికల్లో తక్కువగా ఓట్లు పోలయ్యాయి.
- చార్మినార్‌లో 2,06,658 ఓట్లకు గాను 95,063 ఓట్లు (46 శాతం) పోలయ్యాయి.
- యాకుత్‌పురాలో 328640 ఓట్లకు గాను 1,02,207 ఓట్లు (31.1 శాతం).
- చాంద్రాయణగుట్టలో 2,96,904 ఓట్లకు గాను 1,15,496 ఓట్లు (38.9 శాతం)
- బహదూర్‌పురాలో 2,66,033 ఓట్లకు గాను 1,00,560 ఓట్లు (37.8 శాతం) పోలింగ్ నమోదైంది.

'మళ్లీ మోదీయే ప్రధాని'



గోల్కొండ: మూడోసారి భారత ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేస్తారని బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. ఎగ్జిట్ పోల్స్‌లో వస్తున్న లెక్కల కంటే బీజేపీకి పెద్ద సంఖ్యలో సీట్లు వస్తాయని ఆయన అన్నారు. ప్రధాని గతంలో చెప్పిన విధంగా బీజేపీ 400 సీట్లు గెలవడం ఖాయమన్నారు.

నియామకం


సర్వేశ్ కుమార్

గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా సాకెల్లి సర్వేశ్ కుమార్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. రానున్న బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో సర్వేశ్ కుమార్ బస్తీ ప్రజలు, పెద్దలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్వేశ్ కుమార్ మాట్లాడుతూ.. ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను ఈసారి వైభవంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే దేవాలయంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవీ బాధ్యతలు అప్పగించిన బస్తీ ప్రజలు, పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలన్నారు.

ర్యాలీలకు అనుమతులు తీసుకోవాలి


సయ్యద్ ఫయాజ్, ఏసీపీ

గోల్కొండ: ఎన్నికల ఫలితాల అనంతరం అనుమతులు లేని ర్యాలీలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఏ పార్టీ అభ్యర్థి గెలిచిన కూడా రోడ్లపైకి వచ్చి ర్యాలీలు తీయడం నిషేధం అని నేటి నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు నిషేధాజ్ఞాలు అమలులో ఉంటాయన్నారు. గుంపులుగా ఒకే చోట నిలపడడం కూడా నిషేధం అని ఆయన అన్నారు. మద్యం షాపులు కూడా మూసి ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. రోడ్లపై జెండాలు పెట్టడం, జెండాలతో ఊరేగింపులు తీయడం నిషేధించబడ్డాయని ఆయన అన్నారు.

అసదుద్దీన్ ఒవైసీ గెలుపు కోసం పూజలు



చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విజయం సాధించాలని కోరుతూ యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజేశ్వర్ రావు తెలిపారు. మంగళవారం జరగనున్న కౌంటింగ్ సందర్భంగా తాను కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాత్రి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించానన్నారు.

ఏసీపీ కె.ఎం.కిరణ్‌కుమార్‌కు ఐపీఎం మెడల్


మెడల్‌ను ప్రదానం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

అబిడ్స్: సీసీఎస్ ఏసీపీ కె.ఎం.కిరణ్‌కుమార్‌కు ఐపీఎం (ఇండియన్ పోలీస్ మెడల్) బహూకరించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏసీపీ కిరణ్‌కుమార్‌కు ఐపీఎం మెడల్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ..జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఐపీఎం మెడల్ పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాను పోలీసు విధులు నిర్వహించిన అన్ని ప్రాంతాల్లో సహకరించిన సిబ్బందికి, అధికారులకు, ఉన్నతాధికారులకు కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం


జెండా ఆవిష్కరణలో శీలం బాల్‌చందర్ తదితరులు

విజయనగర్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు అంబరాన్నంటాయి. ఆసిఫ్‌నగర్ డివిజన్ శంకర్‌నగర్‌లో సోమవారం ప్రధాన కార్యదర్శి శీలం బాల్‌చందర్ ఆధ్వర్యంలో జాతీయ పతాకం ఎగరవేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరుల త్యాగం, ఉద్యమకారుల పోరాటం, సంఘీభావంతో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని పేర్కొన్నారు. రైతుబంధు, దళితబంధు, పెన్షన్లు, తదితర సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సీహెచ్.లక్ష్మీనారాయణ, ధరమ్‌వీర్‌సింగ్, రేణేశ్వర్ గౌడ్, బాలప్ప, నవీన్‌కుమార్, భిక్షపతి గౌడ్, గౌతమ్, విశాల్, నిహాన్స్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సూపర్ లీగ్ 8వ సీజన్



ఫైనల్‌లో విజయం సాధించిన క్లస్టర్స్

అబిడ్స్: లియో 11వ వేదిక శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ ఆధ్వర్యంలోని హైదరాబాద్ సూపర్ లీగ్ 8వ సీజన్ ఫుట్‌బాల్ వేడుకలు ముగిశాయి. ఈ ఫైనల్ మ్యాచ్‌లో క్లస్టర్స్ 1–0 స్వల్ప ఆధిక్యంతో విజయం చేజిగిచ్చుకుంది. ఫైనల్ టోర్నమెంట్‌లో పాల్గొన్న జెట్లు పోరాట స్ఫూర్తితో పోటీతత్వాన్ని ప్రదర్శించాయి. హైదరాబాద్ లిటిల్‌స్టార్స్ సాకర్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ లీగ్ పోటీలు వినోదాత్మకంగా ముగిశాయి. తెలంగాణ ప్రాంతంలో యువతకు ఫుట్‌బాల్ అవకాశాలను పెంచడానికి ఈ లీగ్ వేడుకలు నిర్వహించామని శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ రిజర్వ్‌డ్ టీమ్ హెడ్ కోచ్ సెథిక్ మహ్మద్ తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

చాంద్రాయణగుట్ట: విద్యుదాఘాతంతో ఓ కూలీ మృతి చెందిన ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై పాండు తెలిపిన వివరాల ప్రకారం..గౌలిపురా మేకలమండి ప్రాంతంలో వేణుగోపాల్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేసుకుంటున్నాడు. పిల్లర్ గుంతలో నుంచి నీరు తొలగించడానికి సోమవారం ఉదయం వేణుగోపాల్ లాల్‌దర్వాజా మోడ్ వద్ద లేబర్ అడ్డా నుంచి వట్టెపల్లికి చెందిన షేక్ సాజిద్ (31)ను తీసుకొని వెళ్లాడు. పిల్లర్ గుంతలో చేరిన నీటిని మోటార్‌తో తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో నీటితో నిండిన పిల్లర్ గుంతలో పడి మృతి చెందాడు. ఇది గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్రా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందడంతో పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై సమాచారం అందుకున్న ఛత్రినాక పోలీసులు వివరాలను సేకరించి ఇంటి యజమానిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చార్మినార్‌లో బీజేపీ పటిష్టతకు కృషి చేయాలి


లక్ష్మణ్‌ను కలిసిన ప్రవీణ్‌కుమార్

చార్మినార్: చార్మినార్‌లో బీజేపీ పటిష్టతకు కృషి చేయాలని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ చెప్పినట్లు బీజేపీ చార్మినార్ నియోజకవర్గం నూతన కన్వీనర్ షెట్టి ప్రవీణ్ కుమార్ తెలిపారు. తాను చార్మినార్ కన్వీనర్‌గా నియమితులైన సందర్భంగా లక్ష్మణ్‌ను కలిసి ధన్యవాదాలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. తనకు శాలువా కప్పి అభినందించి చార్మినార్‌లో పార్టీ బలోపేతానికి అందరితో కలిసి పని చేయాలని సూచించినట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల ధన్యవాదాలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి


కాలనీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ నీరజా కాలనీ, గుడిమల్కాపూర్ బాలాజీనగర్‌కు చెందిన కాలనీల ప్రతినిధులు ఆయనను కలిశారు. తమ కాలనీ అభివృద్ధికి కృషి చేసినందుకు వారు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. గత పదేళ్ల నుంచి కాలనీలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులను చేసిపెట్టారని వర్షాకాలంలో సైతం వరద నీరు రోడ్లపై నిలవ ఉండకుండా ప్రత్యేకంగా వరద నీటి పైప్‌లైన్‌లు వేయడంతో తమకు వరద నీటితో తిప్పలు తప్పాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి


మైత్రి కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న లంగర్‌హౌజ్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్

గోల్కొండ: పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని లంగర్ హౌజ్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ అన్నారు. సోమవారం లంగర్ హౌజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మైత్రి కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రానున్న బక్రీద్ సందర్భంగా పోలీసులు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. జంతువుల అక్రమ రవాణా నేరం అని ఇటువంటి సంఘటనలపై తాము చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. మైత్రి కమిటీ సభ్యులు శాంతిభద్రతలను కాపాడడంలో తమకు సహకరించాలని ఆయన సూచించారు. మైత్రి కమిటీ సభ్యులు డి.నర్సింగ్‌రావు, కె.చంటిబాబు, షేక్‌షకీలా, ఏ.చంద్రశేఖర్, డాక్టర్ రహమాన్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



గౌలిపురా: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని పటేల్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ వారు ఆదివారం రాత్రి నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా సాకెల్లి సర్వేశ్ కుమార్, అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జి.కృష్ణ, మధుచారి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వేణుగోపాల్, జాయింట్ సెక్రటరీలుగా పి.సతీష్ (చిన్న), కె.నర్సింహారాజ్, కార్య నిర్వాహక కార్యదర్శి ఎం.శివ కుమార్, సోనూ, డి.నవీన్‌కుమార్, కోశాధికారిగా డి.మనీష్, కార్యవర్గ సభ్యులుగా నరేష్, నిఖిల్, బాల్‌రాజ్, సన్నీ, మనోజ్, శ్రావణ్, నర్సింగ్, సాయి, కృష్ణ యాదవ్, అభిషేక్, కిశోర్, ప్రధాన అర్చకులుగా విష్ణుచారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాల సందర్భంగా ఈసారి రేణుకా ఎల్లమ్మ ఆలయం అమ్మవారి ఘటాన్ని నిర్వహించనున్నామన్నారు.

ప్రశంసా పత్రాల అందజేత




యాకుత్‌పురా: 90 వేల మంది అసంఘటిత కార్మికుల పిల్లలకు సెట్విన్‌లో శిక్షణ అందించారని రాష్ట్ర కార్మిక శాఖ అదనపు కమిషనర్, తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సీఈఓ డాక్టర్ ఈ. గంగాధర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలను పుస్కరిచుకొన్ని ఆదివారం పురానీహవేలీలోని సెట్విన్ సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సెట్విన్ ఎండీ వేణుగోపాల్‌రావుతో కలిసి సెట్విన్ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్



లంగర్‌హౌజ్: లంగర్‌హౌజ్ బాపూఘట్ ఎదురుగా జరుగుతున్న ఇన్‌ఫ్యాంట్ హ్యాండ్‌లూమ్ హ్యాండి క్రాఫ్ ఎగ్జిబిషన్ అందరిని ఆకట్టుకుంటుంది. విద్యార్థులకు సెలవు కావడంతో సాయంత్రం కాగానే ఎగ్జిబిషన్‌కు పెద్ద ఎత్తున పిల్లలు, పెద్దలు తరలివస్తున్నారు. ఎగ్జిబిషన్‌లో అన్ని వయస్సుల వారు ఇష్టపడే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామని ఎగ్జిబిషన్ నిర్వాహకులు క్రిష్టోఫర్ తెలిపారు. అమెరికా అధ్యక్షుడి నివాస భవనమైన వైట్ హౌజ్ నమూనాను కూడా ఇక్కడ ప్రదర్శిస్తున్నామని ఆయన అన్నారు. పిల్లలు వేసవి సెలవులను ఇక్కడకు వచ్చి సరదాగా గడపవచ్చునని ఆయన సూచించారు.

కేసీఆర్‌తోనే ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణకు ఖ్యాతి



అబిడ్స్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణకు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి లభించిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో విశ్వవ్యాప్తంగా అగ్రగామిగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా గోడేకబర్ ప్రాంతంలో తెలంగాణ తల్లికి పూల మాలలు వేసి సంబరాలు చేశారు. అనంతరం ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. 6 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం దివాల తీసిందన్నారు. బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. సురేష్ ముదిరాజ్, శైలేష్ కురుమ, సల్మాన్, ధన్‌రాజ్ యాదవ్, ధనుష్, అనిల్, సుధాకర్, విశాల్ పాల్గొన్నారు.